సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 30 । జూలై । 2023




సింహగిరి.. భక్తజన సిరి

ఏకాదశితో పాటు మొహరం సెలవుదినం కలిసి రావడంతో భక్తులు అధిక సంఖ్యలో అప్పన్న దర్శనానికి తరలివచ్చారు. 8లో



భక్తి శ్రద్ధలతో మొహర్రం

మక్కామసీదు, జామియా మసీద్, యాసీన్ మసీదు, న్యూకాలనీ, చినవాల్తేరు తదితర మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. 8లో



'విశాఖ-రంగపర' వీక్లీ రద్దు

విశాఖలో ఆదివారం బయల్దేరాల్సిన విశాఖపట్నం-రంగపర నార్త్(08562) జనసాధారణ్ వీక్లీ స్పెషల్‌ను రద్దు చేశారు. 8లో

న్యూస్‌రీల్

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే నెల 1వ తేదీన విశాఖ పర్యటనకు వస్తున్న దృష్ట్యా జిల్లా అధికారులు ఏర్పాట్లను వేగవంతం చేశారు. కైలాసపురం ప్రాంతంలో రహేజా సంస్థ నిర్మించనున్న ఇనార్బిట్ మాల్ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. సీఎం పర్యటకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ శనివారం పరిశీలించారు. ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రాంగణంలోని హెలీప్యాడ్ వద్ద పనులను సందర్శించారు. ఏయూలో ప్రారంభోత్సవాలకు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు.

6న బీచ్‌రోడ్డులో హ్యాండ్లూమ్ శారీ వాక్



ఆల్బమ్‌ను విడుదల చేస్తున్న స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటీ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: బీచ్‌రోడ్డులో వచ్చే నెల 6న హ్యాండ్లూమ్ శారీ వాక్ నిర్వహిస్తున్నట్లు ది స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటీ అధ్యక్షుడు వైసీహెచ్ దొరబాబు, కార్యదర్శి డాక్టర్ సుధా పద్మశ్రీ తెలిపారు. హ్యాండ్లూమ్ శారీ వాక్ ప్రదర్శనపై రూపొందించిన ఆల్బమ్‌ను శనివారం నగరంలోని ఓ హోటల్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత వస్త్రాల వినియోగంపై విస్తృత అవగాహన కోసం తొలిసారిగా సాగరతీరంలో ఈ కార్యక్రమం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే సుమారు 4 వేల మంది మహిళలు వాక్‌లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు చెప్పారు. ఆ రోజు ఉదయం 6 గంటలకు బీచ్‌రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ నుంచి ప్రారంభం కానున్న వాక్‌లో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఒలింపియన్ కరణం మల్లేశ్వరి, డాక్టర్ సువర్ణ వర్మ తదితరులు పాల్గొంటున్నట్లు వెల్లడించారు. చేనేత కార్మికులకు మద్దతుగా పెద్ద ఎత్తున మహిళలు పాల్గొనాలని కోరారు. కార్పొరేటర్ ఉషశ్రీ, సొసైటీ కోశాధికారి సంగీత, సభ్యులు పాల్గొన్నారు.


సముద్రంలో సవాళ్లపై చర్చ



సదస్సులో పాల్గొన్న నేవీ అధికారులు

సింధియా : కీలక విభాగాల సిబ్బందంతా ఒకేచోట చేరి వారి ఆలోచనలు పంచుకోవడంతో సముద్రంలో సవాళ్లను అధిగమించేందుకు మరింత అవకాశం ఏర్పడిందని తూర్పు నావికాదళం వైస్ అడ్మిరల్ బిశ్వజిత్ దాస్ గుప్తా అన్నారు. తూర్పు నావికాదళం తొలి ఆర్థిక సమన్వయ సదస్సును విశాఖలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బిశ్వజిత్ మాట్లాడుతూ పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ ప్రక్రియలో పాల్గొన్న అన్ని వాటాదారులు మధ్య సాన్నిహిత్యాన్ని మరింత బలపరచడమే లక్ష్యంగా సదస్సు నిర్వహించినట్లు చెప్పారు. దేశాల మధ్య సమన్వయం, వనరుల కేటాయింపు, ఆర్థిక నిర్వహణ సామర్థ్యం వంటి అంశాలను సదస్సులో చర్చించామన్నారు. ఈ సదస్సుకు నేవల్ కమాండ్ ఎస్ఎస్ పెంధార్కర్, ఐడీఏఎస్, పీసీడీఏ(నేవీ), అబ్రాఘోష్, ఐడీఏఎస్, ఐఎఫ్ఏ (ఈఎన్‌సీ), ఇతర ఆర్థిక అధికారులు హాజరయ్యారు.

నగరంలో.. 12 ఫ్లై ఓవర్లు



సిద్ధమవుతున్న డీపీఆర్‌లు
- రూ.600 కోట్లతో కేజీహెచ్ అభివృద్ధి
- జోడుగుళ్లపాలెంలో మత్స్యకారులకు షెడ్ల నిర్మాణం
- పితానిదిబ్బ సమస్యకు త్వరితగతిన పరిష్కారం
- సత్యనారాయణ స్వామి ఆలయ ఘాట్ రోడ్డు త్వరలోనే పూర్తి
- తూర్పు, దక్షిణ నియోజకవర్గాలపై ఇన్‌చార్జి మంత్రి రజని, టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి సమీక్ష

సాక్షి, విశాఖపట్నం: సమగ్ర సంక్షేమం, అభివృద్ధి అంశాల్లో విశాఖపట్నం పరుగులు పెట్టేలా బృహత్తర ప్రణాళికలు అమలు చేస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విశాఖ తూర్పు, దక్షిణ నియోజకవర్గాల వారీగా అభివృద్ధి, సమస్యలపై శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ, జీవీఎంసీ, నాడు-నేడు, గడపగడపకు మన ప్రభుత్వం, ఇతర అంశాలపై జరిగిన సమీక్షలో మంత్రి రజని మాట్లాడారు. నియోజకవర్గాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో కొన్ని పూర్తి కాగా.. మరికొన్ని పురోగతి దశ లో ఉన్నాయని తెలిపారు. జీవీఎంసీ పరిధిలో అనకాపల్లి నుంచి తగరపువలస వరకు 12 ఫ్లై ఓవర్లు ఎన్‌హెచ్ఏఐ ద్వారా చేపట్టేందుకు డీపీఆర్‌లు సిద్ధమవుతున్నాయని.. జిల్లాను మరింత అభివృద్ధి చేసేందుకు సీఎం జగన్ కృతనిశ్చయంతో ఉన్నట్లు చెప్పారు. జగనన్న సురక్ష ద్వారా ప్రజలు సమస్యలు పరిష్కృతమవుతున్నాయని తెలిపారు. కేజీహెచ్‌ను రూ.600 కోట్ల నాడు-నేడు నిధులతో అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. రూ.11 కోట్ల సీఎస్ఆర్ నిధులతో కలెక్టర్ మల్లికార్జున కేజీహెచ్ ను అభివృద్ధి చేశారని తెలిపారు. టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రతీ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష చేస్తున్నట్లు వివరించారు. ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వంలో వచ్చిన సమస్యలపై దృష్టి సారించి.. రెండు మూడు నెలల్లో పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.



తూర్పు నియోజకవర్గ సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని

తూర్పు నియోజకవర్గ సమీక్షలో భాగంగా మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, కలెక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, జిల్లా అధికారులు, కార్పొరేటర్లు వివిధ అంశాలపై చర్చించారు.

- జీవో 388 ద్వారా 3,267 అభ్యంతరం లేని ఆక్రమణలను గుర్తించి.. 1,590 మందికి కన్వేయన్స్ డీడ్ పూర్తి చేశామని కలెక్టర్ వెల్లడించారు. 9వ వార్డులో సచివాలయ భవనం, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 3 సెంట్లు కేటాయించామని.. జీవీఎంసీ త్వరలోనే నిర్మాణం ప్రారంభిస్తుందన్నారు.
- జోడుగుళ్లపాలెంలో ఫిషర్‌మెన్ షెడ్లు నిర్మించేందుకు సర్వే నిర్వహించి.. సెప్టెంబర్‌లోగా ఎకరం స్థలం అందించాలని కలెక్టర్‌కు మంత్రి రజని సూచించారు. మద్దిలపాలెం సర్వే నం.4లోని కేఆర్ఎంకాలనీ అంశం ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందని.. త్వరలో ఈ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పితాని దిబ్బకాలనీ నివాసితుల అంశం కోర్టులో పెండింగ్‌లో ఉన్నందున.. పరిష్కార మార్గాన్ని అన్వేషిస్తున్నట్లు తెలిపారు. రామకృష్ణాపురం నివాసితులకు సంబంధించిన అంశంపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని మంత్రి వెల్లడించారు
- తూర్పు నియోజకవర్గంలో పంచ గ్రామాల సమస్య కోర్టు పరిధిలో ఉన్నందున.. త్వరలోనే ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. 23వ వార్డులో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ఆర్టీసీ అధికారులతో మాట్లాడి భూ మార్పిడి పద్ధతి ద్వారా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. ముడసర్లోవలో చెత్త తరలింపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. అప్పుఘర్ వద్ద మురుగు నీటి శుద్ధి పనుల ప్రాజెక్ట్ పూర్తయినట్లు తెలిపారు. త్వరలోనే ప్రతి ఇంటికి అనుసంధానం చేసి 25 ఎంఎల్‌డీ స్టేషన్‌కి పంపింగ్ చేసేలా జీవీఎంసీ చర్యలు తీసుకుంటుందని వివరించారు.
- నాడు-నేడు పనుల ద్వారా నియోజకవర్గంలో 6 యూపీహెచ్‌సీలకు గానూ 5 పూర్తయ్యాయి. నాడు-నేడు ద్వారా ఫేజ్-1లో ఏడు పాఠశాల భవనాలు పూర్తి చేయగా.. ఫేజ్-2లో రూ.7 కోట్లతో 15 పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. గడపగడపకు మన ప్రభుత్వం పనుల్లో భాగంగా 16 వార్డుల్లో 71 పనులు ప్రారంభించినట్లు వెల్లడించారు.
- వీధి దీపాల కోసం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు జీవీఎంసీ కమిషనర్ తెలిపారు. సీసీఎంఎస్ ద్వారా మానిటర్ చేయడమే కాకుండా సచివాలయం ఎమినిటీస్ సెక్రటరీలు ప్రతి రోజూ సాయంత్రం 6.30 నుంచి 7.30 వరకు మానిటర్ చేస్తారన్నారు. వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల మాట్లాడుతూ నియోజకవర్గంలో యూజీడీ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. జీవీఎంసీకి సంబంధించి పలు సమస్యల పరిష్కారం కోసం కార్పొరేటర్లు మంత్రికి వినతిపత్రాలు అందించారు.



దక్షిణ నియోజకవర్గ సమీక్షలో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి

- దక్షిణ నియోజకవర్గ సమీక్షలో భాగంగా రెవెన్యూ, జీవీఎంసీ, నాడు-నేడు, గడప గడపకు మన ప్రభుత్వం తదితర అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష జరిగింది. జీవో 388 ద్వారా 185 అభ్యంతరం లేని ఆక్రమణలకు కన్వేయన్స్ డీడ్ పొందేలా చర్యలు చేపట్టినట్లు మంత్రి రజని తెలిపారు. ఇప్పటికే 169 మందికి కన్వేయన్స్ డీడ్ పూర్తి చేశామన్నారు. అల్లిపురం వెంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన భూముల్లో ఆక్రమిత నివాసదారులకు రిజిస్ట్రేషన్ సంబంధిత సమస్యలు ఉన్నాయన్నారు. ఈ భూములకు బదులుగా అగనంపూడి, పెదగంట్యాడ మండలంలో 7.32 ఎకరాల భూమి మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సీతారామ స్వామి ఆలయానికి సంబంధించిన భూముల్లో ఆక్రమితదారుల భూమికి బదులుగా మరో భూమి గుర్తించాలని ఆర్డీవో హుస్సేన్ సాహెబ్‌ను ఆదేశించారు. కనక మహాలక్ష్మి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం మాట్లాడుతూ ఆలయ వార్షిక కార్యక్రమాలు మొదలైనవి నిర్వహించేందుకు అవసరమైన స్థలం ఇవ్వాలని కోరగా.. స్థల సేకరణకు చర్యలు చేపట్టాలని దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీషాను మంత్రి రజని ఆదేశించారు. జగదాంబ ఎల్లమ్మ తోట భూములపై పలువురు కార్పొరేటర్లు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. జీవీఎంసీకి చెందిన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని కమిషనర్‌ను మంత్రి ఆదేశించారు.
- సత్యనారాయణ స్వామి ఆలయం ఘాట్ రోడ్డు నిర్మాణ పనులు త్వరలోనే పూర్తి చేసి ప్రారంభిస్తామని టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం పనులకు నిధుల సమస్య లేదని.. పూర్తయిన పనులకు ఎప్పటికప్పుడు బిల్లులు అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు.
- నాడు-నేడు పనుల ద్వారా నియోజకవర్గంలో 3 యూపీహెచ్‌సీల నిర్మాణం పూర్తవ్వగా.. మరో 4 యూపీహెచ్‌సీలను అభివృద్ధి చేశామని కలెక్టర్ తెలిపారు. నాడు-నేడు ఫేజ్-1 కింద 10 స్కూల్ భవనాలు పూర్తి చేశామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం పనుల్లో 14 వార్డుల్లో అనుమతి పొందిన 91 పనులకు గానూ 79 పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.
- విశాఖ పోర్టు వల్ల ప్రజలకు కాలుష్య సమస్యలు అధికంగా వస్తున్నాయని షెడ్స్ నిర్మాణాలు చేపట్టాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కోరారు. గ్రీనరీని పెంచాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మత్స్యకారులకు సంబంధించిన సమస్యలను ఆమెకు వివరించారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియం మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. ఏఎంసీ ప్రాంగణంలో ఉన్న మైదానాన్ని స్థానిక ప్రజలకు ఉదయం, సాయంత్రం వేళల్లో కేటాయించాలన్నారు. యూజీడీ పనులు వెంటనే ప్రారంభించాలని, నియోజకవర్గంలో తూర్పు కాపు, రెడ్డిక, కళింగ వైశ్యులకు సంబంధించిన కుల ధ్రువీకరణ పత్రాల జారీలో సమస్యలు అధికంగా ఉన్నాయన్నారు.
- జీవీఎంసీకి సంబంధించి పలు సమస్యలు పరిష్కరించాలని ఆయా వార్డు కార్పొరేటర్లు మంత్రికి వినతిపత్రాలు అందించారు.

బార్లలో సీసీ కెమెరాలు ఉండాల్సిందే..

- మెటల్ డిటెక్టర్ కూడా తప్పనిసరి
- రాత్రి 12 తరువాత తెరిచి ఉంటే కఠిన చర్యలు
- ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

దొండపర్తి: తాటిచెట్లపాలెం బార్ అండ్ రెస్టారెంట్‌లో జరిగిన హత్య ఘటనతో ఆబ్కారీ శాఖ అప్రమత్తమైంది. నిబంధనల ప్రకారం ప్రతి బార్‌లో తప్పనిసరిగా 16 సీసీ కెమెరాలు ఉండాలని ఆదేశాలు జారీ చేసింది. అలాగే కస్టమర్లు లోపలకు మారణాయుధాలతో వెళ్లకుండా ఉండేందుకు మెటల్ డిటెక్టర్లను కూడా ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేసింది. బార్‌ల నిర్వహణపై ఎక్సైజ్ శాఖ అధికారులు దృష్టి సారించారు. తాటిచెట్లపాలెం ప్రాంతంలో విశాఖ బార్ అండ్ రెస్టారెంట్‌లో రెండు రోజుల క్రితం ఒక యువకుడిని కొంత మంది హత్య చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ బార్‌లో సీసీ కెమెరాలు లేకపోవడంతో హత్య చేసిన వారి వివరాలు తెలియరాలేదు. వాస్తవానికి ప్రతి బార్ అండ్ రెస్టారెంట్‌లో నిబంధనల ప్రకారం 16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. కానీ ఆ బార్‌లో సీసీ కెమెరాలు లేకపోవడంతో పోలీసుల దర్యాప్తునకు జాప్యం జరిగింది. దీంతో ఈ విషయంపై ప్రభుత్వ ఆదేశాలతో ఎక్సైజ్ శాఖ అధికారులు బార్లలో పరిస్థితులపై నిఘా పెడుతున్నారు. నిబంధనలు అతిక్రమించే బార్లపై చర్యలు తీసుకొనేందుకు సమాయత్తమవుతున్నారు.

16 సీసీ కెమెరాలు తప్పనిసరి

ప్రతి బార్‌లో 16 సీసీ కెమెరాలు ఉండాలని నిబంధనలు ఉన్నాయి. కానీ చాలా బార్లలో 4, 5 మాత్రమే ఉంటున్నాయి. కొన్నింట్లో ఒకటి కూడా లేనట్లు ఇటీవల జరిగిన ఘటనతో వెలుగులోకి వచ్చింది. అన్ని బార్లలో తనిఖీలు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. బార్లలో తప్పనిసరిగా 16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఇప్పటికే ఎక్సైజ్ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అలాగే బార్ ప్రవేశ మార్గంలో మెటల్ డిటెక్టర్‌ను కూడా ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. నగరంలో కొన్ని బార్లు అర్ధరాత్రి 12 తరువాత కూడా తెరిచి ఉంచుతున్నట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు గుర్తించారు. అటువంటి వాటిపై చర్యలకు ఉపక్రమిస్తున్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

ఎక్సైజ్ శాఖ నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటాం. ప్రతి బార్‌లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు, మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేసుకోవాలి. అలాగే నిర్ణీత సమయాల్లో మాత్రమే బార్లను నిర్వహించాలి. అర్ధరాత్రి 12 తరువాత తెరిచి ఉంచే బార్లపై కఠిన చర్యలు తప్పవు.

– శ్రీనివాసరావు, సూపరింటెండెంట్, ఎక్సైజ్ శాఖ

సీఎం జగన్‌చే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

డాబాగార్డెన్స్: నగరానికి వచ్చే నెల 1వ తేదీన విచ్చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జీవీఎంసీకి చెందిన పలు ప్రాజెక్టుల శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిలో 15వ ఆర్థిక సంఘం నిధులతో రూ.16 కోట్లతో నిర్మించనున్న రోడ్లు, స్మార్ట్ సిటీ ద్వారా రూ.16 కోట్లతో రెండు ప్రాంతాల్లో ఈట్ స్ట్రీట్, నగర సుందరీకరణలో భాగంగా సుమారు రూ.14 కోట్లతో కైలాసగిరికి వెళ్లే జంక్షన్, ఎంవీపీ జంక్షన్, తాటిచెట్లపాలెం జంక్షన్, అక్కయ్యపాలెం జంక్షన్ల అభివృద్ధికి ముఖ్యమంత్రి భూమిపూజ చేయనున్నారు. రూ.107 కోట్లతో మురుగు నీటి(అమృత్ పథకం) ప్రాజెక్టుకు సంబంధించి సీఎం శంకుస్థాపన చేయనున్నారు.

ఆంధ్రా యూనివర్సిటీలో..

తాటిచెట్లపాలెం: సీఎం జగన్ చేతుల మీదుగా ఆంధ్రా యూనివర్సిటీలో పలు ప్రారంభోత్సవాలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ సహకారంతో ఏయూలో దాదాపు రూ.100 కోట్లతో నిర్మించి, అభివృద్ధి చేసిన భవనాలు, కేంద్రాలను సీఎం ప్రారంభించనున్నారు. వీటిలో ముఖ్యంగా స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్(ఆ-హబ్), ఫార్మా ఇంక్యుబేషన్ సెంటర్(ఎలిమెంట్), ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ ప్రాంగణం, నూతనంగా నిర్మించిన హాస్టల్ సముదాయాలు, ఏయూ డిజిటల్ జోన్, అవంతి ఆక్వా కల్చర్ స్కిల్ హబ్ వంటి ఇరవైకి పైగా అభివృద్ధి కార్యక్రమాలు ఉన్నాయి.

నమ్ముకున్న వారికి న్యాయం



బాధ్యతలు స్వీకరిస్తున్న కోలా గురువులు, చిత్రంలో వైవీ సుబ్బారెడ్డి, బూడి ముత్యాలనాయుడు తదితరులు



గురువులును అభినందిస్తున్న సుబ్బారెడ్డి, మంత్రి రజని, చిత్రంలో ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, భీశెట్టి సత్యవతి, ఎమ్మెల్యేలు

- అదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లక్షణం
- ఇందుకు కోలా గురువులే నిదర్శనం
- వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్త సుబ్బారెడ్డి

సాక్షి, విశాఖపట్నం: పార్టీని నమ్ముకుని, క్రమశిక్షణతో పనిచేసే వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేస్తారని వైఎస్సార్ సీపీ ప్రాంతీయ సమన్వయకర్త, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. అదే సీఎం లక్షణమని చెప్పారు. ఇందుకు కోలా గురువులే నిదర్శనమన్నారు. శనివారం విశాఖపట్నం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) నూతన చైర్మన్‌గా కోలా గురువులు బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. గతంలో గురువులను చట్టసభల్లో నిలబెట్టాలని ముఖ్యమంత్రి ప్రయత్నించారన్నారు. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల్లో చంద్రబాబు కుట్ర, వెన్నుపోటు రాజకీయాల వల్ల గురువులు ఓటమి పాలయ్యారన్నారు. మత్స్యకారుడికి అన్యాయం జరిగిందని ముఖ్యమంత్రి జగన్ గురువులకు డీసీసీబీ చైర్మన్ పదవిని కట్టబెట్టారని చెప్పారు. కాబోయే కార్యనిర్వాహక రాజధానికి పార్టీ జిల్లా అధ్యక్ష పదవిని కూడా ఇచ్చారన్నారు. నర్సీపట్నానికి చెందిన పార్టీ నాయకుడు, డీసీసీబీ పూర్వ చైర్‌పర్సన్ చింతకాయల అనిత భర్త సన్యాసిపాత్రుడుకు భవిష్యత్తులో మంచి పదవిని స్తారన్నారు. డీసీసీబీని సమర్థవంతంగా నిర్వహించాలని, రైతు సమస్యలపై దృష్టి సారించి వారికి సేవలందించాలని గురువులను ఆయన కోరారు.

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ పార్టీలో అంకితభావంతో పనిచేసే వారికి ముఖ్యమంత్రి జగన్ ఎంతటి ప్రాధాన్యత, గుర్తింపునిస్తారో గురువులే తార్కాణమన్నారు. గురువులు డీసీసీబీకి మంచి పేరు తీసుకురావాలని, బ్యాంకు అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో కష్టపడి పనిచేసేవారికి సీఎం జగన్ మంచి అవకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. మరే పార్టీలోనూ ఈ తరహా జరగడం లేదని, అలాంటి పార్టీలో పనిచేస్తున్నందుకు గర్వంగా భావిస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ మత్స్యకారులంటే సీఎం జగన్‌కు అపారమైన ప్రేమ ఉందన్నారు. మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్, పార్టీ విశాఖ జిల్లా అధ్యక్ష పదవులను మత్స్యకారునికే ఇవ్వడం గొప్ప విషయమన్నారు. చంద్రబాబు మత్స్యకారులను తాటతీస్తా, తోలు తీస్తా, అంతు చూస్తా.. అంటూ బెదిరిస్తే ముఖ్యమంత్రి జగన్ వారిని అందలమెక్కిస్తున్నారని కొనియాడారు. ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, భీశెట్టి వెంకట సత్యవతి, ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, గొల్ల బాబూరావు, తిప్పల నాగిరెడ్డి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, నెడ్‌క్యాప్ చైర్మన్, విశాఖ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌గా బాధ్యతల స్వీకారం

డీసీసీబీ కార్యాలయంలో నూతన చైర్మన్‌గా కోలా గురువులు శనివారం మధ్యాహ్నం బాధ్యతలు చేపట్టారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం గురువులను మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. డీసీసీబీ సీఈవో డీవీఎస్ వర్మ, అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ డీసీసీబీ కార్యాలయానికి వచ్చి గురువులును అభినందించారు. తనపై విశ్వాసంతో కీలక పదవులు కట్టబెట్టిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పుడూ రుణపడి ఉంటానని గురువులు చెప్పారు.

వ్యాధుల వివరాలు యాప్‌లో నమోదు చేయాలి

మహారాణిపేట : హెచ్ఐవీ, ఇతర సుఖ వ్యాధులకు సంబంధించి పాజిటివ్ కేసుల వివరాలు నెలవారీ యాప్‌లో పొందుపరచాలని ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వర ప్రసాద్ తెలిపారు. జిల్లాలోని పీహెచ్‌సీలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న ఫెసిలిటీ ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్, పరీక్ష కేంద్రాల ల్యాబ్ టెక్నీషియన్లకు యాప్‌పై శిక్షణ కార్యక్రమం శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించారు. ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో సొసైటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వరప్రసాద్ మాట్లాడుతూ దీనికి సంబంధించి నివేదికలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు.

విశాఖ-రంగపర నార్త్ వీక్లీ నేడు రద్దు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నంలో ఆదివారం బయల్దేరాల్సిన విశాఖపట్నం-రంగపర నార్త్(08562) జనసాధారణ్ వీక్లీ స్పెషల్‌ను రద్దు చేశారు. తిరుగు ప్రయాణంలో రంగపర నార్త్‌లో ఆగస్టు 1వ తేదీన బయల్దేరాల్సిన రంగపర నార్త్-విశాఖపట్నం (08561) జనసాధారణ్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ కూడా రద్దు చేశారు. అద్రా డివిజన్‌లో ఈ రైలుకు సంబంధించిన పెయిరింగ్ రైలును రద్దు చేసినందున.. ఇరుమార్గాల్లో ఈ రైలును రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

అమరావతి ఎక్స్‌ప్రెస్ గమ్యం కుదింపు

హుబ్లీ డివిజన్ కేజల్ రాక్-కేరన్‌జోల్ మధ్య బండరాళ్లు పడిన కారణంగా శనివారం షాలిమార్-వాస్కోడిగామా(18047) అమరావతి ఎక్స్‌ప్రెస్‌ను హుబ్లీ వరకు మాత్రమే నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ రైలు ఈ రోజు హుబ్లీ-వాస్కోడిగామా మధ్య రాకపోకలు సాగించదు.

సింహగిరి.. భక్తజన సిరి

- అప్పన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు
- ఒక్కరోజే రూ.44 లక్షల ఆదాయం



అన్నదాన భవనం వద్ద బారులు తీరిన భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి కొలువుదీరిన సింహగిరి శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఏకాదశితో పాటు మొహర్రం సెలవుదినం కలిసి రావడంతో భక్తులు అధిక సంఖ్యలో అప్పన్న దర్శనానికి తరలివచ్చారు. దీంతో దర్శనాల క్యూలన్నీ కిక్కిరిశాయి. ప్రసాద విక్రయశాల, కేశఖండనశాల, గంగధార మార్గం, అన్నదాన భవనం, మాడ వీధులన్నీ భక్తులతో కళకళలాడాయి. ఆర్టీసీ బస్సులు, దేవస్థానం బస్సులు భక్తులతో కిటకిటలాడాయి. ఘాట్‌రోడ్డులో రెండు కార్లు నిలిచిపోవడంతో దాదాపు అరగంటసేపు ట్రాఫిక్ స్తంభించింది. దేవస్థానానికి శనివారం సాయంత్రం 7గంటల లోపు దాదాపు రూ.44 లక్షల ఆదాయం లభించింది. దర్శనాల టికెట్ల ద్వారా రూ.25 లక్షల 98 వేలు, సేవల ద్వారా రూ.84 వేలు, ప్రసాదాల విక్రయం ద్వారా సుమారు రూ.12 లక్షలు, విరాళాల ద్వారా రూ.64 వేలు, కేశఖండనశాల ద్వారా రూ.2.50 లక్షలు, గదుల అద్దె ద్వారా రూ.20వేల ఆదాయం లభించింది.

రైల్వే క్రీడాకారులకు సత్కారం

విశాఖ స్పోర్ట్స్: విశాఖ ఉత్కర్ష్ స్పోర్ట్స్ ఫెస్ట్‌లో రైల్వే క్రీడాకారుల ప్రతిభను గుర్తిస్తూ శనివారం సత్కరించారు. విశాఖలోని సాగరమాల కన్వెన్షన్స్‌లో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఐదుగురు క్రీడాకారులను సత్కరించి, అవార్డులు అందజేశారు. ఈకోర్స్ వాల్తేర్, ఈకోర్వా వాల్తేర్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. భారతీయ రైల్వేస్ బాక్సింగ్ చీఫ్ కోచ్ దీపక్‌హుడా, అర్జున అవార్డు గ్రహీత బాక్సర్ మనోజ్‌కుమార్, సీనియర్ రైల్వేమెన్ బాక్సింగ్ కోచ్ దివాకర్ ప్రసాద్, ధ్యాన్‌చంద్ అవార్డీ ఎన్. ఉష, వుమెన్ బాక్సింగ్ కోచ్ శ్రీనివాసరావులను స్పోర్ట్స్ ఫెస్ట్‌లో డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్, ఆయన సతీమణి మంజుశ్రీ ప్రసాద్ సత్కరించారు. డీఆర్‌ఎం మాట్లాడుతూ ప్రతిభావంతులైన రైల్వే క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహిస్తామన్నారు.

భక్తి శ్రద్ధలతో మొహర్రం



మొహర్రం సందర్భంగా రక్తం చిందిస్తూ విచారం వెలిబుచ్చుతున్న షియా ముస్లింలు

డాబాగార్డెన్స్ : నగరంలోని మక్కామసీదు, జామియా మసీద్, యాసీన్ మసీదు, న్యూకాలనీ, చినవాల్తేరు తదితర మసీదుల్లో మొహర్రం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఖురాన్ పఠించి, ఫాతెహా నిర్వహించారు. అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. నగరంలోని చెంగలరావుపేటలో గల హుస్సైనీ మసీదు కమిటీ ఆధ్వర్యంలో సంతాప కార్యక్రమం నిర్వహించారు. అంజుమన్ హుస్సైనీ మసీదు నుంచి మాతం (రక్తతర్పణం) ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువు అబుల్ హసన్ మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త మనవుడు ఇమామ్ హుస్సేన్ ధర్మ పరిరక్షణకు చేసిన త్యాగానికి ప్రతీక మొహర్రం అని పేర్కొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వైఎంసీఏలో రగడ



నిరసన తెలుపుతున్న సభ్యులు

బీచ్‌రోడ్డు: వైఎంసీఏలో అవకతవకలు జరుగుతున్నాయని నినాదాలు చేసిన కొందరు సభ్యులను జనరల్ బాడీ సమావేశానికి అనుమతించలేదు. దీంతో వివాదం చోటు చేసుకుంది. బీచ్‌రోడ్డులోని వైఎంసీఏలో శనివారం రీజినల్ సమావేశం జరిగింది. ఆ సమయంలో వైఎంసీఏలో నిధుల దుర్వినియోగం, స్థలాల అక్రమ లీజు, అమ్మకం తదితర అంశాలపై కొంత మంది సభ్యులు నినాదాలు చేసుకుంటూ సమావేశానికి వచ్చారు. అయితే వారిని సమావేశానికి అనుమతించకుండా బయటకు పంపించేశారు. దీంతో వారు వైఎంసీఏ బయట ఫ్లకార్డులతో నిరసన తెలిపారు. 72 క్లబ్‌లకు గానూ రీజినల్ చైర్మన్‌కు అనుకూలంగా ఉన్న 27 క్లబ్ ప్రతినిధులను పిలిచి సమావేశం నిర్వహించారని ఆరోపించారు. వైఎంసీఏ ఆస్తులు, ఆదాయం నేషనల్ కౌన్సిల్‌కి చెందినవని, వాటిని నుంచి వచ్చే ఆదాయన్ని సౌత్ ఈస్ట్ రీజినల్ చైర్మన్ రోనాల్డ్ విలియమ్స్ కాజేస్తున్నారన్నారు. ఆస్తులను కాపాడాలని, నిధులు దుర్వినియోగం ఆపాలని కోరినందుకు తమపై దౌర్జన్యం చేశారని మండిపడ్డారు. నిరసనలో జెసీ శోభన్ బాబు, వై.రంజిత్, మేడిది శ్యామ్, జి.స్టాన్లి జోన్స్ తదితరులు పాల్గొన్నారు.

వాళ్ల సభ్యత్వం రద్దయింది

రీజినల్ సమావేశానికి కేవలం సభ్యత్వం ఉన్నా వారిని మాత్రమే అనుమతించినట్లు సౌత్‌ఈస్ట్ రీజినల్ చైర్మన్ రోనాల్డ్ విలియమ్స్ తెలిపారు. నిరసన చేసిన వారి సభ్యత్వాన్ని నేషనల్ కౌన్సిల్ ఎప్పుడో రద్దు చేసిందన్నారు. వాళ్ల మీద బైండోవర్ కూడా నమోదై ఉందన్నారు. వాళ్ల క్లబ్‌లను రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు.

మైక్రో న్యూరో సర్జరీపై వర్క్‌షాప్



వర్క్‌షాప్ ప్రారంభిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు

మహారాణిపేట: న్యూరోలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మైక్రో న్యూరో సర్జరీ, మైక్రోవాస్కులర్ సచరింగ్ కోర్సుకు సంబంధించిన వర్క్‌షాప్ నగరంలోని ఓ హోటల్‌లో శనివారం ప్రారంభమైంది. అపెక్స్ ఐవోఎస్ సహకారంతో విశాఖలో మొదటిసారి నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌కు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన న్యూరో సర్జరీ ప్రతినిధులు హాజరయ్యారు. మైక్రో సచరింగ్ టెక్నిక్స్, మైక్రోవాస్కులర్ సచరింగ్‌లో శిక్షణకు సంబంధించిన అంశాలపై ఈ వర్క్‌షాప్ జరిగింది. సిమ్యులేటర్ ఆధారిత బ్రెయిన్ డిసెక్షన్ మోడల్‌ను ఉపయోగించి శిక్షణనివ్వడం దేశంలోనే మొదటిసారి కావడం విశేషం. ప్రముఖ న్యూరోసర్జన్లు డాక్టర్ కె. శ్రీధర్ (చెన్నై), డాక్టర్ పరితోష్ పాండే (బెంగళూరు), డాక్టర్ విను గోపాల్ (కొట్టాయం), డాక్టర్ సందీప్ తలారి (విశాఖపట్నం) ఈ శిక్షణనిచ్చారు. అపెక్స్ ఐఓఎస్‌ఎస్‌కు చెందిన డాక్టర్ కె. స్రవంత్ సమన్వయకర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, పూర్వ డీఎంఈ డాక్టర్ కె. సత్య వరప్రసాద్, అపెక్స్ ఐవోఎస్‌ఎస్ న్యూరో సర్జన్ డాక్టర్ కె. శ్రీధర్ పాల్గొన్నారు. అనంతరం వీరిని సన్మానించారు.

హత్య కేసులో ఇద్దరికి రిమాండ్

మర్రిపాలెం: ఆటోడ్రైవర్ చిరంజీవి హత్య కేసులో ఇద్దరిని ఐదో పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాలివీ. గురువారం అర్ధరాత్రి కప్పరాడ బాపూజీనగర్‌లో చిరంజీవి(30)ని అదే ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మద్యం మత్తులో దాడి చేసి హతమార్చారు. ఏ-1 బి.ఉదయ్ కుమార్(19), ఏ-2 ఊస సతీష్‌లను(20) సీఐ ఎస్.సాయి శనివారం అరెస్ట్ చేశారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తాపత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.